



# కరపత్రం

SINCE 2014

శనివారం సెప్టెంబర్ 19,2026 సంపుటి : 2 సంచిక : 341 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4





## 22ఏ భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- హైలెవల్ కమిటీ ఏర్పాటు
- ముగ్గురు అధికారులతో కమిటీ
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ చైర్మన్
- లా సెక్రటరీ, ఐజీ సభ్యులుగా
- 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం
- నిషేధిత జాబితాపై అభ్యంతరాల పరిశీలన
- అర్హులైన భూ యజమానులకు ఊరట
- రెవెన్యూ, న్యాయ, రిజిస్ట్రేషన్ అంశాలపై సమీక్ష
- పొంగులేటి ఆదేశాలతో కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్:** తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ముగ్గురు అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీ ఏర్పాటైంది. రెవెన్యూ, న్యాయ, రిజిస్ట్రేషన్ సంబంధిత అంశాలను పరిశీలించి 22ఏ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించడమే కమిటీ ప్రధాన ఉద్దేశం.

### ముగ్గురు అధికారులతో కమిటీ

22ఏ భూముల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు.

మిగతాద్ది 2 లో



## స్పీకర్‌కు హోంమంత్రి పదవి?

- కాబోయే హోంమంత్రి మీరేనని సమాచారం
- స్పీకర్ ప్రసాద్‌తో బలాలా వ్యాఖ్యలు
- అసెంబ్లీలో ఆసక్తికర వ్యాఖ్యలు
- శాంతిభద్రతలపై బలాలా ఆందోళన
- హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ క్షీణించింది
- నేరస్తుల్లో పోలీసులంటే భయం లేదు
- కఠిన శిక్షలతోనే నేరాల నియంత్రణ
- ప్రస్తుతం హోంశాఖ సీఎం రేవంత్ వద్దే

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి 'కాబోయే హోంమంత్రి మీరే అవుతారని మాకు సమాచారం ఉంది.. అందుకే శాంతి భద్రతల విషయం మీకు చెబుతున్నాం' అంటూ ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా కామెంట్స్ చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా ఆందోళన వ్యక్తం చేశారు. నేరస్తుల్లో పోలీసులంటే భయం లేకుండా పోయిందని, నేరాలను అరికట్టాలంటే కఠినంగా శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్ నగరంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందని బలాలా పేర్కొన్నారు. నేరస్తులకు చట్టం, శిక్షలంటే భయం లేకపోవడం వల్లే నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడితేనే వాటిని నియంత్రించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఈ క్రమంలో స్పీకర్‌ను ఉద్దేశించి బలాలా చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో ఆసక్తికరంగా మారాయి. 'కాబోయే హోంమంత్రి మీరే అవుతారని మాకు సమాచారం ఉంది.. అందుకే మీకు చెబుతున్నాం స్పీకర్ గారు' అని అన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని ఆయన కోరారు. నగరంలో నేరాల నియంత్రణకు పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు, నేరస్తుల్లో చట్టంపై భయాన్ని కలిగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బలాలా సూచించారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై చర్చ మొదలైంది. స్పీకర్‌కు హోంమంత్రి పదవి ఇస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం హోంశాఖ.. సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉంది.

2 లో



## ఓటు చోరీ.. ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ: రాహుల్ గాంధీ

భాజపా, కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో టీఎంసీ గ్రూప్‌లు.. ఆ పార్టీ పేరు, ఎన్నికల గుర్తును వాడకుండా ఈసీ ఇచ్చిన ఆదేశాలను తప్పుబట్టారు. ప్రజా తీర్పును రక్షించడమే ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. కానీ దానికి వ్యతిరేకంగా అది ప్రజల తీర్పును తారుమారు




## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీ లో కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.

## దానం నాగేందర్ ఎపిసోడ్.. సుప్రీంలో బీఆర్ఎస్ కేవియట్ పిటిషన్




**ఢిల్లీ:** సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత పిటిషన్ నేపథ్యంలో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేస్తే తమ వాదనలు వినాలని కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. కాగా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీకి దిగడంతో దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే.

## హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



2 లో

**హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, పిటిషనర్ కౌశిక్‌రెడ్డి స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...

## దానం అనర్హత.. ప్రజాస్వామ్య విజయం



2లో..

- హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలి
- స్పీకర్ తీరుతోనే ఈ పరిస్థితి
- శాసన వ్యవస్థ తప్పితే న్యాయ వ్యవస్థ జోక్యం
- కాంగ్రెస్ స్వార్థ రాజకీయాలు: బండి సంజయ్
- రాజకీయాలకు అతీతంగా స్పీకర్ వ్యవహరించాలి
- రాజ్యాంగాన్ని అనుసరించాలి: బండి సంజయ్
- శాసనసభ పరువు కాపాడాలి



## జన్వాడ ఫాం హౌస్ భూమి నాదే

- కేటీఆర్‌కు భూములతో సంబంధం లేదు
- కేటీఆర్ చిన్నప్పటి నుంచే స్నేహితుడు
- ఫాం హౌస్‌ను కేటీఆర్‌కు లీజుకిచ్చా
- భూములకు లీగల్‌గా క్లియర్ టైటిల్ ఉంది
- అనుమానాలుంటే నోటీసులు ఇవ్వండి
- అధికారులు అడిగితే పత్రాలు ఇస్తా
- రాజకీయ నేతల పరిశీలన సరికాదు
- చట్టపరమైన విచారణకు సహకరిస్తా

2 లో

**హైదరాబాద్:** జన్వాడ ఫాం హౌస్ భూములపై జరుగుతున్న ప్రచారం, రాజకీయ పార్టీల నేతలు పరిశీలనకు వస్తారన్న వార్తల నేపథ్యంలో.. ఫాం హౌస్ యజమాని ప్రదీప్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ప్రదీప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జన్వాడ ఫాం హౌస్ ఉన్న భూమి తన సొంతమని, ఈ ఫాం హౌస్ భూమికి, కేటీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు.కేటీఆర్, తాను చిన్నప్పటి నుంచి స్నేహితులమని చెప్పారు.



2 లో

## కేసీఆర్ ఫాంహౌస్‌లో కబ్జా నిరూపించండి

- నిరూపిస్తే మా ఎమ్మెల్యేలంతా రాజీనామా
- కబ్జా కాదని తేలితే సీఎం, మంత్రులు రాజీనామా చేస్తారా?
- కాంగ్రెస్‌కు హరీష్‌రావు సవాల్
- ఈ సవాల్‌కు కాంగ్రెస్ సిద్ధమా?
- 300 ఎకరాల కబ్జా ఆరోపణలు నిరూపించాలి
- కేసీఆర్ ఫాంహౌస్‌పై రేవంత్ విచారణ ఆదేశాలు
- కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ ఆరోపణలు

**హైదరాబాద్:** కాంగ్రెస్ నేతలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావు మరోసారి సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేసీఆర్ ఫాంహౌస్‌లో కబ్జా జరిగిందని నిరూపించాలంటూ చాలెంజ్ చేశారు. ఒకవేళ నిరూపిస్తే తమ ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తామన్నారు.



2లో..

## కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో రెండోరోజు ముగిసిన సర్వే

**ఎర్రవల్లి:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి లోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూముల్లో రెండో రోజు క్షేత్ర స్థాయి సర్వే జరిగింది. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో 325 సర్వే నెంబరులోని 388 ఎకరాల భూములకు సంబంధించి సర్వే చేశారు. గురువారం.. మూడు గ్రామాల సరిహద్దు భూములను గుర్తించిన అధికారులు మార్కింగ్ చేశారు.

## ఏఎంఆర్, ఏఎంఆర్ఎల్ గ్రూప్ ఆస్తులు ఫ్రీజ్ చేసిన ఈడీ




2లో..

**హైదరాబాద్:** నగరంలోని ఏఎంఆర్, ఏఎంఆర్ఎల్ గ్రూప్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు రూ. 6. 5కోట్ల ఆస్తులు, నగదు, సెక్యూరిటీలను ఫ్రీజ్ చేశారు. హైదరాబాద్ ఒడిశాలోని సంస్థ కార్యాలయాలతో పాటు గ్రూప్ ప్రమోటర్లు, అనుబంధ సంస్థలకు సంబంధించిన ప్రాంతాల్లోనూ ఈడీ తనిఖీలు చేపట్టింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 19,2026

# ప్రజాస్వామ్య విజయం.. దానం నాగేందర్ అనర్హత వేటు తీర్పుపై బండి సంజయ్ స్పందన

మొదటిపేజీ తరువాయి
పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు తీర్పుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్?పై హైకోర్టు అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. శాసన వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకున్న కాంగ్రెస్?కు హైకోర్టు జడ్జిమెంట్ చెంపపెట్టు లాంటిదన్నారు.
శాసన వ్యవస్థ విచక్షణాధికారంలో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పీకర్ తలొగ్గడంవల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ఉంటే నేడు ఈ పరిస్థితి తలెత్తేది కాదని వ్యాఖ్యానించారు.

పట్టపగలు దేశమంతా చూస్తుండగా హత్య చేసిన వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించడం ఎంత తప్పో.. ఒక పార్టీ నుండి గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుండి పోటీ చేసినా అనర్హత వేటు వేయకపోవడం అంతే తప్పని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంటరీ/శాసన వ్యవస్థే అత్యున్నతం.. ఆ వ్యవస్థే పక్షపాతంగా వ్యవహరించి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే అనివార్యంగా న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుని సరిదిద్దుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు.
కాంగ్రెస్ పార్టీ తన స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం మొత్తం వ్యవస్థలనే ధ్వంసం చేసేందుకు వెనుకాడటం లేదనేది తేట తెల్లమైందని విమర్శించారు. ఇకనైనా రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా శాసనసభ స్పీకర్ వ్యవహరించాలని కోరారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.
రాజ్యాంగ బుక్ ను పట్టుకుని షో చేసినంత మాత్రాన రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షకుడు కాలేరని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం ఏం చెబుతుందో దానిని అనుసరించాలనే సోయిఉండాలి కదా అని చురకలంటించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పీకర్ పై ఒత్తిడి తెచ్చి శాసనసభ పరువు తీస్తుంటే పట్టించుకోరా..? శాసనసభ వ్యవస్థను కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# బెంగాల్ ఉప ఎన్నికల వేళ.. మమతకు షాక్



పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండు స్థానాల్లో ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగా.. మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకొన్నారు. ఈ మేరకు ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బెంగాల్ సీఎం సువేందు అధికారితో సమావేశమైన అనంతరం పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు సంచిత ప్రకటించడం గమనార్హం. తన వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నందిగ్రామ్ నుంచి నామినేషన్ ఉపసంహరించుకోవడంపై మమతా బెనర్జీ స్పందించారు. ఇది ప్రతిపక్షాలను అంతం చేయాలనే ఆలోచనతో భాజపా చేస్తున్న కుట్ర అని విమర్శించారు. భాజపా గతంలో మహారాష్ట్రలోని ఉద్ధవ్ ఠాక్రే పార్టీని చీల్చిందని, ఇప్పుడు తన పార్టీనీ లేకుండా చేయాలనే ఇలాంటి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఇది చీకటి రోజని, తన వర్గం నుంచి ఎవరూ పోటీ చేయకుండా భాజపా అడ్డుకుంటోందని విమర్శించారు. ఉప ఎన్నికల కోసం ఇక నందిగ్రామ్ నుంచి మరెవరినీ బరిలోకి దించబోమని.. తమ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తుందని దీదీ ప్రకటించారు. భాజపాను దేశం నుంచి వెళ్లగొట్టడమే తన లక్ష్యమని.. అందుకోసం ఇండియా కూటమి తో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే.

**– కాంగ్రెస్ అభ్యర్థి అరెస్ట్**
నందిగ్రామ్ రాజకీయం రసవత్తరంగా మారింది. ఉప ఎన్నికలో మమత మద్దతు పొందిన కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. 2007లో భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలకు సంబంధించిన ఓ కేసులో ఆయన్ను అరెస్ట్ చేశారని కాంగ్రెస్ తెలిపింది. ప్రతిపక్షాలకు రాజకీయంగా స్థానం లేకుండా చేసేందుకు అధికార భాజపా కుట్రలు పన్నుతోందని ఆ పార్టీ ఆరోపించింది. దేశంలో ప్రజాస్వామ్యం కోరుకుంటున్నారా? నియంతృత్వం కోరుకుంటున్నారా? అని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మీతా చక్రవర్తి ప్రశ్నించారు.

# పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం.. 28న ప్రారంభం

చెన్నై: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చేందుకు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన ప్రతి చిన్నారికీ ఒక గ్రాము బంగారు ఉంగరం ఇచ్చే పథకాన్ని ఈ నెల 28 నుంచి ప్రారంభించబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 'మేనమామ బంగారు ఉంగరం' పేరుతో ఈ పథకాన్ని సీఎం విజయ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. జూన్ 22 నుంచి పుట్టిన ప్రతి చిన్నారికీ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఇప్పటికే 1.28 లక్షల ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం.

బెంగాల్ ఉప ఎన్నికల వేళ.. మమతకు షాక్




అయితే, ఉప ఎన్నికలు జరగనున్న మదురాంతకం, ధారాపురం నియోజకవర్గాల్లో మాత్రం ఈ పథకం అమలుకు తాత్కాలిక బ్రేక్ పడనుంది. ఉచిత అల్పాహార పథకం విస్తరణకు మాత్రమే ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందిందని, బంగారు ఉంగరం పథకానికి అనుమతి లేదని ఈసీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వర్గాల ప్రకారం తమిళనాడులో ఏటా 7.8 లక్షల జననాలు నమోదవుతాయి. వాటిలో దాదాపు 4.2 లక్షల మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించినవారే. వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

# హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
దానంపై అనర్హత వేటు..బీఆర్ఎస్ పార్టీకి లభించిన విజయమని పేర్కొన్నారు. "అమ్ముడుపోతే.. అనర్హత వేటు తప్పదని మేం గతంలోనే చెప్పాం. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తాం. ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తుంది. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితి" అని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో రెండోరోజు ముగిసిన సర్వే

మొదటిపేజీ తరువాయి
సర్వే నెం. 325లోని 388 ఎకరాల భూములపై ఆరా తీసి.. సర్వే నెంబర్లు, గతంలో రైతుల పేర్లపై వివరాలు సేకరించారు. ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియ నాయక్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు సర్వే ప్రక్రియ చేపట్టాయి. ప్రస్తుత రెవెన్యూ రికార్డులపై దృష్టి సారించిన అధికారులు.. వివరాలను నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నారు.

# సంచలనం సృష్టించిన నిఠారీ హత్యల కేసు.. సురేందర్ కోలీ ఆత్మహత్య..!

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2005-06 నిఠారీ వరుస హత్యల కేసు లో నిర్దోషి సురేందర్ కోలీ మృతి చెందాడు. హరిద్వార్‌లో ఒక టీస్టాల్‌లో ఉరికి వేలాడుతూ కనిపించాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
2006లో నొయిడాలోని నిఠారీ వద్ద మోనిందర్‌సింగ్ పంధేర్ ఇంటి వెనుక మురుగుకాల్వలో 16 మంది చిన్నారుల అస్థికలు బయటపడటం తీవ్ర కలకలం సృష్టించింది . ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. పంధేర్‌తోపాటు అతడి ఇంట్లో సహాయకుడైన కోలీని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో మొత్తం 19 కేసులను 2007లో నమోదు చేసింది. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వాటిలో మూడింటిని మూసివేసింది. మిగతా కేసుల్లో కోలీని నిర్దోషిగా 2023 అక్టోబరు 16న అలహాబాద్ హైకోర్టు తేల్చింది.
అప్పటికి పంధేర్‌పై మూడు కేసులు మిగిలి ఉండగా.. వాటిలో అతణ్నీ నిర్దోషిగా నిర్ధారించింది. దర్యాప్తులో సీబీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిందితులే నేరం చేసినట్టు ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో సీబీఐ, మృతుల తరఫు బంధువులు పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ సుప్రీం కోర్టు గత ఏడాది జులైలో కొట్టివేసింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం హరిద్వార్ వెళ్లిపోయిన కోలీ.. అక్కడే ఓ టీషాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ఇలాంటి వారిని ఎలా విద్యార్థిగా పరిగణించగలం: ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం




దేశ రాజధానిలో దిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఎన్నికల్లో గూండాగిరి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యా సంస్థలో చోటుచేసుకున్న ఘర్షణలు, నిబంధనల ఉల్లంఘనలపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. విద్యార్థి సంఘాల ప్రవర్తనను ఖండించింది. 'మీ పద్ధతి మార్చుకోలేదు' అంటూ ఘాటువ్యాఖ్యలు చేసింది. క్యాంపస్‌లోకి పెద్ద సంఖ్యలో వాహనాలను ఎలా అనుమతించారని అధికారుల్ని ప్రశ్నించిన న్యాయస్థానం.. దీనిపై రేపటిలోగా చర్యలు తీసుకోకపోతే, కౌంటింగ్ నిలిపివేస్తామని హెచ్చరించింది. అలాగే ఫలితాల అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో, హాస్టళ్లలో విజయోత్సవాలపై నిషేధం విధించింది.
నంబర్ ప్లేట్లు లేని 10 నుంచి 20 వాహనాల కాన్వాయ్‌ను విశ్వవిద్యాలయంలోకి అనుమతించడం, వాహనాల బానెట్లు, పైకప్పులపై నిలబడి ప్రచారం చేయడమేంటని విచారణ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. దానికి సంబంధించిన ఫొటోలను పరిశీలించింది. ఆ ఫొటోల్లో ఒక వ్యక్తి తుపాకీ పట్టుకొని ఉండటంపై అసహనం వ్యక్తంచేసింది. అలాంటి వారిని విద్యార్థిగా ఎలా పరిగణించగలమని, అలాంటి వారివల్ల అసలైన విద్యార్థులకు అవకాశాలు దూరమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘర్షణలను అడ్డుకునేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని దిల్లీ పోలీసుల్ని అడిగింది. బాధ్యులైన విద్యార్థులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడొద్దని సూచించింది. విద్యార్థి సంఘం ఎన్నికల్లో భాగమైన విద్యార్థి సంఘాలు, అభ్యర్థులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విశ్వవిద్యాలయంలో జరిగిన ఘర్షణలపై రెండువారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

# బ్రీత్ టెస్ట్ మిస్.. 8మంది పైలట్లపై సస్పెన్షన్ వేటు

బ్రీత్ టెస్టుకు నిర్ణీత సమయంలో హాజరుకాకపోవడంతో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 8 మంది పైలట్లను సస్పెండ్ చేసింది. మూడు నెలల పాటు విధుల నుంచి తొలగించింది. దుబాయ్-అమృత్‌సర్ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలోని సిబ్బంది అమృత్‌సర్‌లోని శ్రీ గురు రామ్ దాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండైన తర్వాత రెండు గంటల్లోపు పోస్ట్-ఫ్లైట్ డిక్లరేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. అయితే వారు 35 నిమిషాల ఆలస్యంగా బ్రీత్ అనలైజర్ పరీక్ష కు హాజరయ్యారు. దీంతో ఈ విషయాన్ని విమానయాన సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ దృష్టికి తీసుకువెళ్లింది. అనంతరం ఆల్కహాల్ పరీక్షలో వారికి నెగెటివ్ వచ్చినప్పటికీ..

# జన్వాడ ఫాం హౌస్ భూమి నాదే

మొదటిపేజీ తరువాయి
తన సొంత ప్రాపర్టీ అయిన జన్వాడ ఫాం హౌస్‌ను కేటీఆర్‌కు లీజ్‌కు ఇచ్చానని, ప్రస్తుతం ఈ ఫాం హౌస్‌ను పరిశీలించేందుకు రాజకీయ పార్టీల నేతలు వస్తారన్న ప్రచారం జరుగుతోందని ఆయన తెలిపారు.
ప్రభుత్వానికి లేదా సంబంధిత అధికారులకు ఏమైనా అనుమానాలు ఉంటే, తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. ఫాం హౌస్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేవని, ఈ భూములకు లీగల్‌గా క్లియర్ టైటిల్ ఉందని తెలిపారు.
ప్రభుత్వ అధికారులు ఏవైనా వివరాలు లేదా పత్రాలు కోరితే, చట్టపరమైన విధానంలో వాటిని సమర్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అయితే రాజకీయ పార్టీల నేతలు వచ్చి వ్యక్తిగత ఆస్తిని పరిశీలిస్తామంటూ రాజకీయ వివాదం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. చట్టపరమైన ప్రక్రియకు తాను పూర్తిగా సహకరిస్తానని ప్రదీప్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి
2016 జులై 19న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి.
గుర్తింపు ఇలా..: ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

# ఓటు చోరీ.. ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ: రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి
చేసే శక్తులకు సహకరిస్తోందని దుయ్యబట్టారు. పార్టీలను విడగొట్టి.. ఎన్నికల గుర్తును లాక్కోవడం ఈసీ, భాజపాలకు అలవాటైపోయిందన్నారు.
'మొదట శివసేన, ఆ తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ . ప్రతిసారీ ఇదే పద్ధతి. ఒక పార్టీని చీల్చడానికి భాజపా, ఎన్నికల సంఘం చేతులు కలుపుతాయి. ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాగేసుకుంటాయి. ఒక పార్టీ మొత్తాన్నే దొంగలించగలిగినప్పుడు, కోట్లాది మంది భారతీయుల ఓట్లను కూడా చోరీ చేయడంలో ఆశ్చర్యం లేదు. ఓటు దొంగలు, ప్రభుత్వ దొంగలు.. ఇప్పుడు పార్టీల దొంగలుగా మారారు. ఈ చర్యలు మన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నాలుగా మారాయి. పార్టీని కాపాడుకోవాలనే ఈ పోరాటం కేవలం మమతా బెనర్జీది మాత్రమే కాదు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరు పోరాటం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# కేసీఆర్ ఫాంహౌస్‌లో కబ్జా నిరూపించండి

మొదటిపేజీ తరువాయి
కబ్జా కాదని తేలితే సీఎం సహా మంత్రులంతా రాజీనామాలు చేస్తారా? అని ప్రశ్నించారు.

గత రెండు రోజులుగా కేసీఆర్ ఫాంహౌస్ అంశం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. దీని కారణం సీఎం రేవంత్ వ్యాఖ్యలు. రెండు రోజుల క్రితం అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్.. కేసీఆర్ ఫాంహౌస్‌పై విచారణకు ఆదేశించారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో 340 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, వెంటనే నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. కల్వకుంట్ల కుటుంబానికి 440 ఎకరాల భూమి ఉందని, ధరణిని అడ్డుపెట్టుకుని కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని రేవంత్ ఆరోపించారు.
అదే అంశంపై హరీష్‌రావు సీరియస్‌గా స్పందించారు. ఏదైతే 300 ఎకరాలు కబ్జా అంటూ సీఎం రేవంత్ వ్యాఖ్యానించారో వాటిని నిరూపించాలంటూ కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. నిరూపిస్తే తమ ఎమ్మెల్యేలమంతా రాజీనామా చేస్తామని, కాకపోతే మీరంతా రాజీనామా చేస్తారా? అని హరీష్ ప్రశ్నించారు. ఈ సవాల్‌కు కాంగ్రెస్ సిద్ధమా? అంటూ నిలదీశారు.

# ఏఎంఆర్, ఏఎంఆర్ఎల్ గ్రూప్ ఆస్తులు ఫ్రీజ్ చేసిన ఈడీ

మొదటిపేజీ తరువాయి
SREI గ్రూప్‌లోన్ డిఫాల్ట్, మనీలాండరింగ్ కేసులో సోదాలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. బ్యాంకు ఖాతాల్లోని రూ.1.50 కోట్లు, డీమ్యాట్, సెక్యూరిటీల్లో రూ.2.90 కోట్లు ఫ్రీజ్ చేసినట్టు తెలిపారు. నగదు, బంగారు ఆభరణాలు కలిపి రూ.1.95 కోట్ల విలువ ఉంటుందని అధికారుల అంచనా. AMR, AMRL, ARSS గ్రూపులు SREI సంస్థల నుంచి భారీగా రుణాలు తీసుకున్నట్లు ఈడీ గుర్తించింది. రుణాల డిఫాల్ట్‌తో పాటు నిధుల మళ్లింపు, రౌండ్-ట్రిప్పింగ్‌పై ఈడీ సందేహాలు వ్యక్తం చేసింది. రెండు గ్రూపులకు సంబంధించి రూ.1,111 కోట్ల రుణాలు బకాయి ఉన్నట్లు గుర్తించింది. సోదాల్లో లభించిన ఆధారాలను పరిశీలిస్తున్నామని ఈడీ ప్రకటించింది.

# 22ఏ భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి
22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములపై వచ్చిన అభ్యంతరాలు, రికార్డులు, చట్టపరమైన అంశాలను పరిశీలించి పరిష్కార మార్గాలను సూచించనుంది.

**ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కారం**
22ఏ జాబితాలో చేరిన ప్రైవేటు భూముల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన సందర్భాల్లో అర్హత ఉన్న యజమానులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూముల వర్గీకరణ, రెవెన్యూ రికార్డులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హత ఉన్న కేసులను వేగంగా పరిష్కరించేలా కమిటీ పనిచేయనుంది. ఇటీవల అసెంబ్లీలో 22ఏ భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 12 అంశాలతో కూడిన కార్యాచరణను ప్రకటించారు. ఇందులో అసైన్డ్ భూములు, ఆమోదిత లేఅవుట్లలోని భూములు, జీఓ 59, జీఓ 118, నాలా చార్జీలు, అనధికార లేఅవుట్లు తదితర అంశాల పరిష్కారానికి చర్యలు ప్రకటించారు.

**పొంగులేటి ఆదేశాలతో..**
ముఖ్యమంత్రి అసెంబ్లీ ప్రకటన నేపథ్యంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. 22ఏ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో నిషేధిత జాబితాలో ఉన్న భూములపై ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి ఈ కమిటీ నిర్ణయాలు కీలకం కానున్నాయి.

## ఘనంగా ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

కరపత్రం ప్రతినిధి, , వేములవాడ



వేములవాడ కోర్టు ప్రధాన ద్వారం ముందు న్యాయవాదుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆది శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్, ఏజీపీలు బొడ్డు ప్రశాంత్ కుమార్, పుప్పాల భానుకృష్ణ, మాజీ అధ్యక్షులు వేముల సుధాకర్ రెడ్డి, పెంట రాజు, సీనియర్ న్యాయవాదులు కొడిమ్యాల పురుషోత్తం,నాగుల సంపత్, జెట్టి శేఖర్, భీమా మహేష్ బాబు, ఒద్యారపు వేణు కుమార్, మహేందర్, మహేష్, రమేష్, నాగేంద్రబాబు, నిఖిల్, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ, సరిత,సుజాత, పద్మ, మమత, లావణ్య, పావని తదితరులు పాల్గొన్నారు...

## ప్రపంచ వెదురు దినోత్సవానికి తరలిన మేదరులు

కరపత్రం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల



సెప్టెంబర్ 18 ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మేదర కులస్తులు శుక్రవారం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా కులస్తులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేదర్లను గుర్తించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోన శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కోన బాల శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ్రిగల మల్లేశం, జిల్లా కోశాధికారి రాంసాగర్, జిల్లా మాజీ అధ్యక్షులు కనికరపు రాజయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు బొల్లం కనకయ్య, కోన శ్రీనివాస్,కనికరపు రమేష్, సూరినీడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో ఘనంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

కరపత్రం ప్రతినిధి భూపాలపల్లి. సెప్టెంబర్ 18



భూపాల్ పల్లి జిల్లా కేంద్రంలో తేదీ 18.09.2026 రోజున తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ గారి జన్మదినం సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి,నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్, మేకల సంపత్,నరివెద్ది వెంకట్ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం ఆత్మగౌరవం ప్రధాన ఏజెండగా గత తొమ్మిది సంవత్సరాలుగా పోరాటం చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వ కమిటీ ఏర్పాటు చేసేలా కృషిచేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈనెల 27 న లక్ష్మి నరసింహా ఫంక్షన్ హాల్ యాదగిరిగుట్ట లో జరిగే ఫోరమ్ 09 వ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పట్టణ అధ్యక్షుడు యాల్లా సురేందర్,బండారి రవి, బాబర్ పాషా, బొమ్మెర రాజేశ్వరి,రాతి పల్లి,శారద లావుద్య తిరుపతమ్మ,ఎద్దు పుష్ప, పోతిని రాజేశ్వరి, బిల్లా అశోక్ రెడ్డి,నలిగేటి సతీష్,బందెల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం

- పోలీసు సిబ్బందికి స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన సీపీ శ్రీ అంబర్ కిషోర్



కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని సెప్టెంబర్ 18:

రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీపీ స్వయంగా భక్తులకు, పోలీసు సిబ్బందికి అన్నప్రసాదాన్ని వడ్డించారు.పోలీసు సిబ్బందితో కలిసి భోజనం చేసి, వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఐకమత్యం, సమన్వయం, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని, విధుల నిర్వహణలో పరస్పర సహకారం, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు సిబ్బందికి సూచించారు. వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సేవాభావంతో

## కాలానుగుణ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పరిశుభ్రత, సురక్షిత ఆహారం, దోమల నివారణతో వ్యాధులను అరికట్టవచ్చు

కరపత్రం ప్రతినిధి, చిట్యాల, సెప్టెంబర్ 18:

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వర్షాల కారణంగా కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఏఎస్, చిట్యాల వైద్యులు డా. మనోజ్ పొనగంటి సూచించారు. వర్షాకాలంలో జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, విరేచనాలతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు.ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా చాలా వరకు కాలానుగుణ వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తప్పనిసరిగా శుభ్రమైన నీటిని తాగడంతో పాటు తాజా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చేతులను సబ్బుతో తరచూ శుభ్రంగా కడుక్కోవాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు దోమతెరలు, దోమల నివారణ మందులు వినియోగించాలని సూచించారు.



జ్వరం వచ్చినప్పుడు తగినంత విశ్రాంతి తీసుకుంటూ ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. వాంతులు, విరేచనాలు ఉన్నప్పుడు శరీరంలో నీరు, లవణాలు తగ్గకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వినియోగించరాదని స్పష్టం చేశారు.

ప్రమాదకర లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

అధికంగా లేదా నిరంతరంగా జ్వరం ఉండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో నొప్పి, స్పృహలో మార్పు, తీవ్రమైన నీరసం, పదేపదే వాంతులు, మూత్రం తగ్గిపోవడం, తీవ్రమైన కడుపునొప్పి, మూర్ఛలు లేదా ముక్కు, చిగుళ్ల నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆసుపత్రిని సంప్రదించాలని డా. మనోజ్ పొనగంటి సూచించారు."పరిశుభ్రత, సురక్షితమైన ఆహారం, శుభ్రమైన నీరు మరియు దోమల నివారణ చర్యలు పాటించడం ద్వారా కాలానుగుణ వ్యాధులను చాలా వరకు నివారించవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని డా. మనోజ్ పొనగంటి తెలిపారు.

## కృష్ణవేణి పాఠశాలల్లో ఘనంగా ఆరోగ్య అవగాహన శిబిరం

కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని సెప్టెంబర్ 18:

కృష్ణవేణి పాఠశాలలు, ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషుల కోసం ఆరోగ్య పరీక్షలు మరియు ఆరోగ్య అవగాహన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కృష్ణవేణి పాఠశాలల చైర్మన్ శ్రీ పి. శ్రీనివాస్ రెడ్డి గారు, కరస్పాండెంట్ శ్రీమతి పి. మంజుల రెడ్డి గారు హాజరై శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమబద్ధమైన జీవన విధానం మరియు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.నేత్ర పరీక్షలు శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు డా. అలీ అహ్మద్ పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం, డిజిటల్ పరికరాల వినియోగంలో




పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దంత పరీక్షలు దంత వైద్య విభాగంలో డా. ఈ.తనూజ, డా. ఆర్.శివాణి, డా. ఆర్.మొహమ్ పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు దంత పరీక్షలు నిర్వహించారు. నోటి పరిశుభ్రత, సరైన బ్రషింగ్ పద్ధతులు, దంత సంరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై వైద్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ "ఆరోగ్యకరమైన విద్యార్థులే



ఆరోగ్యకరమైన సమాజానికి పునాది" అని పేర్కొంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించడం పాఠశాల బాధ్యత అని తెలిపారు. ఆరోగ్య శిబిరానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్యుల సూచనలు, సలహాలను పొందారు.శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వైద్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బందికి కృష్ణవేణి పాఠశాలల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని సెప్టెంబర్ 18:

రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తాము ప్రారంభించిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ శాఖ సూచనల మేరకు ఆయా మండపాల నిర్వాహకులు, యువత తగిన జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు.ఇదే విధంగా నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సీపీ సూచించారు.



అనంతరం పోలీస్ ప్రధాన కార్యాలయంలో గత ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని శోభాయాత్రను సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. గణపతి విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ పోలీస్ అధికారులు, సిబ్బంది,పిల్లలు, మహిళలు కోలాటాలు, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏవో



శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు బీమేష్, శ్రీనివాస్, ఆర్ఐలు శేఖర్, రమేష్, దామోదర్, మల్లేశం, సీసీ సందీప్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సంయుక్త కార్యదర్శి ఓంకార్, సీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల స్వావలంబనకు మోటార్ ట్రైసైకిళ్లు

- నరసరావుపేటలో 10 మంది దివ్యాంగులకు వాహనాల పంపిణీ
- ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

కరపత్రం ప్రతినిధి , నరసరావుపేట, సెప్టెంబర్ 18 :

దివ్యాంగులు స్వయం ఆధారంగా జీవనం సాగించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు. దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలో శుక్రవారం మోటార్ ట్రైసైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన 10 మంది దివ్యాంగులకు ఒక్కొక్కటి రూ.1.30 లక్షల విలువైన మూడు చక్రాల మోటార్ వాహనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ దివ్యాంగులకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత అర్హతలు, లైసెన్స్ కలిగి స్వయం ఉపాధి పొందుతున్న దివ్యాంగులకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెల ఒకట తేది ఉదయంనే ఫించన్ల క్రింద రూ.6 వేలు , దయాలసిస్ రోగులకు పది వేలు , దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి 15 వేల రూపాయలు అందించడం జరుగుతున్నదన్నారు. గత ప్రభుత్వంలో దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 370 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.



దివ్యంగ విద్యార్డులకు ట్రై సైకిల్స్ , వీల్ చైర్స్ , ల్యాప్ టాప్ లు , ఫోల్డింగ్ వాకింగ్ స్టిక్స్ అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పరిశ్రమలలో దివ్యాంగులకు ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక కోటా ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025--26 ఆర్థిక సంవత్సరంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 10 చొప్పున మొత్తం 1,750 మోటార్ ట్రైసైకిళ్లను అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఒక్కో నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులను దరఖాస్తుల పరిశీలన, అర్హతల ఆధారంగా ఎంపిక చేసి వాహనాలు అందించే విధానం అమలులో ఉందన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఈ పథకం కింద నమోదైన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి అర్హత పొందిన వారిలో తొలి విడతగా 10 మందిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి సంవత్సరం దివ్యాంగులకు మరిన్ని మోటార్ ట్రైసైకిళ్లు అందించే అవకాశం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే కాలంలో కూడా దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.దివ్యాంగుల సంక్షేమం



కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే అరవింద బాబు తెలిపారు. దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. మోటార్ ట్రైసైకిళ్లతో నిర్వహించిన ర్యాలీ పట్టణంలో ప్రత్యేకంగా ఆకట్టుకుంది. వాహనాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగ లబ్ధిదారులు, టీడీపీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, గాడిపర్తి సురేష్, గట్టుపల్లి సత్యన్నారాయణ, షేక్ మాబు, చితిరాల బాలు, సంక్షేమ శాఖ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 19,2026

# నాయిని చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- నిమజ్జనం ప్రశాంతంగా.. పకడ్బందీగా జరగాలి
- మూడు క్రేన్లతో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు
- భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు పోలీస్ కమిషనర్ గౌస్ అలాం కీలక సూచనలు





**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట, సెప్టెంబర్ 8:** జమ్మికుంట పట్టణంలో శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నేపథ్యంలో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ అలాం పరిశీలించారు.నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు, యువత తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా అవసరమైన సాంకేతిక, భద్రతా సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

**మూడు క్రేన్లతో నిమజ్జనం**

నాయిని చెరువు వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం వేగంగా, సురక్షితంగా జరిగేలా మూడు క్రేన్లను ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ గౌస్ అలాం సంబంధిత అధికారులకు సూచించారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా ఉండేలా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు.ఒకేసారి పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున క్రేన్ల నిర్వహణ, వాహనాల రాకపోకలు, భక్తుల కదలికలకు సంబంధించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రదేశంలో గందరగోళానికి అవకాశం లేకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**భద్రతకు అధిక ప్రాధాన్యం**

నిమజ్జన కార్యక్రమంలో ప్రధానంగా భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సూచించారు. చెరువు వద్ద ప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ సిబ్బందిని తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచనలు చేశారు.నిమజ్జన ప్రాంతంలో అనుమానాస్పద పరిస్థితులు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిఘా పెంచాలని, భక్తులు క్రమశిక్షణతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

**ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

గణేష్ నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గణేష్ విగ్రహాలతో వచ్చే వాహనాలకు, భక్తుల వాహనాలకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు.నిమజ్జన ప్రదేశం చుట్టుపక్కల అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని, అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా మార్గాలను ఖాళీగా ఉంచాలని సూచించారు.

**పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం**

నిమజ్జనం పూర్తయిన అనంతరం చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా మారకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులు, నిర్వాహకులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసే చెత్త సేకరణ కేంద్రాల్లో వేయాలని అధికారులు కోరారు.నిమజ్జన ప్రాంతంలో పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునీటి వసతి కూడా కల్పించాలని సూచించారు.**

**విద్యుత్, లైటింగ్ ఏర్పాట్లు**

నిమజ్జన కార్యక్రమం రాత్రి సమయాల్లో కూడా కొనసాగే అవకాశం ఉన్నందున నాయిని చెరువు పరిసరాల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యుత్ వైర్లు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ల విషయంలో ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.నిమజ్జన ప్రాంతంలో చీకటి ప్రాంతాలు లేకుండా తగిన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విద్యుత్ సౌకర్యాలు కూడా సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు

**శాఖల మధ్య సమన్వయం అవసరం**

గణేష్ నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ గౌస్ అలాం సూచించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను ముందుగానే పూర్తి చేసి, నిమజ్జనం రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని, లోటుపాట్లు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**మండపాల నిర్వాహకులు సహకరించాలి**

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు. నిమజ్జనం సమయంలో విగ్రహాలతో వచ్చే వాహనాల్లో పరిమితికి మించి వ్యక్తులను ఎక్కించుకోరాదని, భక్తులు చెరువులోకి వెళ్లకుండా భద్రతా సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు.నిమజ్జన కార్యక్రమాన్ని పోటీగా కాకుండా భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహించాలని, డీజేలు, ఊరేగింపులు, వాహనాల విషయంలో పోలీస్ శాఖ నిబంధనలను పాటించాలని కోరారు.

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని అధికారులు కోరారు. నిమజ్జన సమయంలో ఇతరులకు ఇబ్బంది కలగకుండా, ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.పట్టణ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, యువత, భక్తులు పోలీస్ మరియు మున్సిపల్ అధికారులకు సహకరిస్తే నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పూర్తి చేయవచ్చని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా నాయిని చెరువు వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ గౌస్ అలాం అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఉద్యోగుల సహనం పరీక్షించవద్దు దారం శ్రీనివాస్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులు తమ జీతాలు, జీవితాలు, కుటుంబాలను పణంగా పెట్టి పోరాడారని, అలాంటి ఉద్యోగులు నేడు తమ న్యాయమైన హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని టీఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ శ్రీ దారం శ్రీనివాస్‌రెడ్డి , టీజీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ కన్వీనర్ శ్రీ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ అన్నారు.టి జి ఇ జె ఎ సి ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ టీఎన్‌జీవోల సంఘ భవన్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు ఎస్మా కేసులు, రాజద్రోహం కేసుల బెదిరింపులను సైతం లెక్కచేయకుండా ఉద్యమించారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ, మూడు సంవత్సరాలుగా సమస్యలు పెండింగ్‌లోనే ఉండటంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది అని తెలిపారు.చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఉద్యోగుల్లో ఎంతో ఆశ, నమ్మకం నెలకొంది. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సెప్టెంబర్ 18న సమావేశం నిర్వహిస్తుందని ప్రకటించడంతో, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ఉద్యోగులు ఆ తేదీ కోసం ఎంతో ఉత్కంఠతో ఎదురుచూశారని నాయకులు తెలిపారు.అయితే సెప్టెంబర్ 18న జరగాల్సిన సమావేశాన్ని మరోసారి వాయిదా వేయడం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి, ఆవేదన వ్యక్తమవుతోందని అన్నారు. ఇప్పటికే అనేకసార్లు చర్చలు, హామీలు, సమావేశాల కోసం ఎదురుచూసిన ఉద్యోగులకు మళ్లీ వాయిదా పడటం నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించే విధంగా వ్యవహరించకుండా, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన



కాలపరిమితితో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగుల వేతనాలను సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, ఉద్యోగుల నుంచి కాంట్రిబ్యూషన్ తీసుకుని అమలు చేస్తున్న ఈహెచ్‌ఎస్ ఆరోగ్య పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.ఉద్యోగులు తమ జీతాల నుంచి దాచుకున్న జీపీఎఫ్ తదితర మొత్తాలను సకాలంలో చెల్లించాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్తుకు సామాజిక భద్రత కల్పించేందుకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నాయకులు అనేక విజ్ఞాపన పత్రాలు సమర్పించడంతో పాటు, పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి చర్చలు జరిపారని తెలిపారు. సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ఎన్నోసార్లు ఉద్యమ కార్యాచరణను వాయిదా వేసినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం తక్షణమే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొదటి తేదీన జీతం రావడం తప్ప ఉద్యోగుల జీవితాల్లో ఆశించిన స్థాయిలో గణనీయమైన మార్పు కనిపించడం లేదని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల గడపకు చేర్చడం, గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడం, ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడం ఉద్యోగుల బాధ్యతగా కొనసాగుతోందని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని చూసే ఉద్యోగుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం బాధ్యతగా చూడాలని కోరారు.ఉద్యోగుల సహనాన్ని బలహీనతగా భావించవద్దని, మూడు సంవత్సరాలు మౌనంగా ఉన్నంత మాత్రాన ఉద్యోగుల్లో ఆవేదన లేదని అనుకోవద్దని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. చర్చలకు రావడం, రాజీ ప్రయత్నాలు చేయడం ఉద్యోగుల సంస్కారం మాత్రమేనని, ఉద్యోగుల ఐక్యతే తమ బలమని తెలిపారు.ప్రభుత్వం ఇకనైనా ఉద్యోగుల సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఉద్యోగుల్లోని అసంతృప్తి మరింత బలమైన ప్రజాస్వామ్య ఉద్యమంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని నాయకులు స్పష్టం చేశారు.పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు, ఈహెచ్‌ఎస్, ఉద్యోగుల దాచుకున్న సొమ్ము, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు, పెన్షన్ భద్రత తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ,కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు ,గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళి చరణ్, కార్యదర్శి డాక్టర్ అరవింద్ రెడ్డి , రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి ,రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్ ,మహిళా అధ్యక్షులు ఇరుమల్ల శారద, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ ,నాయకులు యు .నాగరాజు, సత్యనారాయణ, నరేష్ పటేల్ ,సునీత సూర్య శైలజ సుస్మిత ,అజ్గర్ అలీ ,నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, బైరి శ్రీనివాస్ ,శంకర్ ,అజ్గర్ అలీ , వారీస్ నవాబ్, అజయ్ కుమార్ ,కమలాకర్, శశి కుమార్, గిరిధర్ రావు తదితరులు పాల్గొన్నారు

# సి-టైప్ నివాస భవనం టవర్ ప్రారంభం



**కరపత్రం ప్రతినిధి, , జ్యోతినగర్(రామగుండం), సెప్టెంబర్ 18:** ఎన్‌టిపిసి సి11 షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోని టౌన్‌షిప్‌లో ఉన్న సి-టైప్ నివాస భవనం యొక్క టవర్-1ను శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హెచ్‌ఓపి (ఆర్‌డటి) చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా విచ్చేశారు. కొత్తగా అభివృద్ధి చేసిన ఈ నివాస భవనం, ఎన్‌టిపిసి టౌన్‌షిప్ యొక్క నివాస మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తుందని, ఉద్యోగులు, వారి కుటుంబాలకు మెరుగైన వసతి సౌకర్యాలను అందించడమే దీని లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ ప్రారంభోత్సవం, టౌన్‌షిప్ సౌకర్యాలను బలోపేతం చేయడానికి, ఎన్‌టిపిసి కమ్యూనిటీకి సౌకర్యవంతమైన, అన్ని సౌకర్యాలు గల నివాస వాతావరణాన్ని సృష్టించడానికి మరో ముందడుగును సూచిస్తుందని వివరించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని



**కరపత్రం ప్రతినిధి , పిడుగురాళ్ల, సెప్టెంబర్ 18 :** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గురజాల నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ హాస్పటల్లో చికిత్స చేయించుకుని మరియు ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేద ప్రజలకు బాసటగా ఉన్న ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 114 (83 చెక్కులు 31 ఎల్ఓసి లను) లబ్ధిదారులకు గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు రూ. 1,12,59,703/- (ఒక కోటి పన్నెండు లక్షల యాభై తొమ్మిది వేల ఏడు వందల మూడు) రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇప్పటి వరకు 1010 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా రూ. 9,87,49,348/- (తొమ్మిది కోట్ల ఎనభై ఏడు లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల నలభై ఎనిమిది) రూపాయలను చెక్కుల రూపంలో యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జానపాడు లో మాలలపై దాడి చేసిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

- దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం) నాయకులు డిమాండ్





**కరపత్రం ప్రతినిధి , నరసరావుపేట, సెప్టెంబర్ 18 :** పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన మాలలపై దాడి చేసిన అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పిడిఎం నాయకులు అగ్రవర్ణాల దాడిలో గాయపడి నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మాల కులస్తులు కోడి రెక్క హేమంత్ తదితరులను శుక్రవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, జానపాడు గ్రామంలో గురువారం రాత్రి పదిన్నర గంటల సమయంలో జరిగిన వినాయకుడి ఊరేగింపు భారీ డిజె సౌండ్ లతో దీపావళి మందులతో పెద్ద పెద్ద ధ్వనులతో మాలపల్లిలో అగ్రవర్ణాలు నిర్వహిస్తూ ఉండగా, మాల కులస్తులైన కోడి రెక్క శ్రీనివాసరావు, కోడి రెక్క హేమంత్ తదితరులు ఇంటిలో చిన్న పిల్లలు ఉన్నారు డిజె సౌండ్ తగ్గించాలని కోరగా, ఇది మా రోడ్డు మా ఇష్టం అంటూ కులం పేరుతో దూషిస్తూ ఇరువురిని అగ్రవర్ణానికి చెందిన ఉన్నం కోటేశ్వరరావు, ఉన్నం నాగమల్లి, యామిని వెంకటేష్ తదితరులు తీవ్రంగా కొట్టడంతో స్పృహ కోల్పోయారని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఈ దాడికి పాల్పడ్డ అగ్రవర్ణాల వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులకు అండగా అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎం సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వరరావు, జి. రామకృష్ణ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.